పరస్పర అవగాహనతో సమస్యల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పరిపాలన పరంగా ఎన్నో సమస్యలు ఎదురవుతాయని.. వాటిని పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని నూతన న్యాయస్థాన భవనంలో ఆదివారం సమస్యలపై పరిష్కార అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ సమస్య ఎంత తీవ్రమైనా పరిష్కారం అనువైన మార్గాన్ని కనుగొనాలని సూచించారు. సీనియర్ న్యాయవాదులు యూఎస్ఆర్ రాజు, బండారు రామకృష్ణ, ఎస్.మాధవరావు, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మహ్మద్ హనీఫుద్దీన్ మాట్లాడుతూ పలు సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, అనకాపల్లి, అల్లూరి జిల్లాల ఎస్పీలు తుహిన్ సిన్హా, అమిత్ బర్దార్ విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు నమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి పీవీ సుధాకర్, డీసీపీ విజయ మణికంఠ, ఏసీపీలు, న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

ఈ మాత్రం చాలునా... ఇంకా కొంచెం పెంచాలా?

- పనితీరు బాగాలేని అధికారులకు సీఎం చురకలు
- ప్రభుత్వ శాఖల్లో యంత్రాంగం నిర్లిప్తతపై అసంతృప్తి

అరకులోయ, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కారం, సేవలు అందించడంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం అరకులోయ మండలం గన్నెలలో నిర్వహించిన సభలో వివిధ శాఖల అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించి పనితీరు బాగోలేని అధికారులకు చురకలు వేశారు. గ్రామస్థాయి సమస్యల పరిష్కారం నుంచి జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ వరకు ప్రజల సంతృప్తి అంతంతమాత్రంగానే ఉందని ముఖ్యమంత్రి గణాంకాలతో వివరించారు. నిర్లక్ష్యవైఖరి వీడి సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ సంతృప్తిస్థాయి 64 శాతం ఉంది. రాష్ట్రస్థాయి కంటే 16 తక్కువగా ఉందని సీఎం వెల్లడించారు.

వీధి దీపాలు.. సంపద కేంద్రాలు 1

గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, సంపద కేంద్రాలు, తాగునీటి సరఫరా బాధ్యతలు చూసే పంచాయతీరాజ్ శాఖను పర్యవేక్షించే జిల్లా పంచాయతీ అధికారిపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంపద కేంద్రాల సంతృప్తి స్థాయి కేవలం 10.54 శాతం మాత్రమే ఉంది. వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కేవలం ఒకట్రెండు సంపద కేంద్రాల్లో మాత్రమే సక్రమంగా పనులు జరుగుతున్నాయి. మిగతా పంచాయతీల్లో కేంద్రాలు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. మేజర్ పంచాయతీ అరకులోయలోని కేంద్రమే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అరకులోయలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతీయ ఆసుపత్రి మార్గంలోనే వీధిదీపాలు వెలగని పరిస్థితి.

రోడ్లు 2

రహదారులు, భవనాల శాఖ అధికారుల పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. రాష్ట్రస్థాయిలో చూస్తే 16 శాతం తక్కువగా ఉంది. జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులను పట్టించుకోవడమే వదిలేశారు. వాస్తవంగా గతంలో ఆర్అండ్‌బీ రహదారుల విస్తీర్ణం బాగా తగ్గింది. అరకులోయ నుంచి విశాఖపట్నం వరకు ఉన్న సుమారు 50 కిలోమీటర్ల పరిధి కాస్తా 10 కిలోమీటర్లకు తగ్గింది. అరకులోయ నుంచి పాడేరు రహదారి సైతం 50 కిలోమీటర్ల నుంచి 5 కిలోమీటర్లకు తగ్గింది. మిగిలిన రోడ్డు ఎన్‌హెచ్ఏఐ కిందకు వెళ్లింది. ఆర్అండ్‌బీ పరిధిలోని రహదారుల మరమ్మతులను అధికారులు గాలికొదిలేశారు. లోతేరు, అరకులోయ- పానిరంగిని, అరకులోయ - అరకు మధ్య రోడ్లు అధ్వానంగా ఉన్నా.. పట్టించుకునే దిక్కు లేదు.

ఆర్టీసీ 3

బస్ కాంప్లెక్స్‌లో సౌకర్యాల కల్పన బాగోలేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అరకులోయ, పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కనీసం తాగునీరు దొరకని పరిస్థితి. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నిర్వహణపై అధికారులు దృష్టిసారించడం లేదు. ప్లాట్‌ఫాంలు ఉన్నా తిరిగే బెంచీలు లేవు.. కూర్చునేందుకు ఇబ్బంది.

సాగునీరు 4

జలవనరుల శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. విస్తారంగా ఆయకట్టు ఉన్న పొలాలకు సాగునీటిని అందించలేని అధికారులను సూచించారు. కొత్తవి పక్కన పెడితే.. అందుబాటులో ఉన్న చెక్ డ్యాంలకు మరమ్మతులు, మినీ రిజర్వాయర్ల నుంచి పంట పొలాలకు సాగునీటిని అందించే చర్యలు అధికారులు చేపట్టడం లేదు.



బొండాం పంచాయతీలో శిథిలమైన చెక్‌డ్యాం

పొదుపు సంఘాలు 5

స్వయం సహాయక సంఘాలను పర్యవేక్షించే సెర్ప్ అధికారుల పనితీరుపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో తేడా 10 శాతం తక్కువగా ఉంది. స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణను గాలికొదిలేశారు. కొత్త సంఘాల ఏర్పాటు, పాత సంఘాలను బలోపేతం చేయడంపై అధికారులు దృష్టిసారించడం లేదు. సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా అందించడంలోనూ అధికారులు అంతంతమాత్రంగానే పనిచేస్తున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంపై శ్రద్ధ కనబరచడం లేదు.

బడుల్లో శుభ్రత 6

ప్రాథమిక పాఠశాలల్లో పరిశుభ్రత రాష్ట్రస్థాయి సంతృప్తి కంటే 7 శాతం తక్కువగా ఉంది. మరుగుదొడ్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపైనా అధికారులు దృష్టిసారించడం లేదు. మరుగుదొడ్లు నిర్మిస్తున్నా నీటి సౌకర్యం కొన్నిచోట్ల లేకపోవడం, ఉన్నవాటిని వినియోగించకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయి.

ఆశ్రమ పాఠశాలలు 7

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సంతృప్తిస్థాయి 7 శాతం తక్కువగా ఉంది. ఆశ్రమాల్లో నాణ్యమైన భోజనాలతోపాటు కనీస సౌకర్యాల కల్పన పరిస్థితి. చాలాచోట్ల తాగు, వాడుక నీరు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారు. రక్షిత నీరు లేకపోవడంతో విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు 8

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో టెండర్‌దారులు సరకులు అందించకపోవడం, నాణ్యమైన సరకులు పంపిణీ చేయకపోవడం వంటి కారణాలు కనిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది.

జాతీయ ప్రమాదకర రహదారి

చింతపల్లి సమీపంలోని చిన్నగెడ్డ వద్ద 516-ఈ జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇక్కడ హైలెవెల్ వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెనకు ఆనుకుని లోతట్టు ప్రాంతంలో పొలాలున్నాయి. మట్టిపోసి చదును చేసిన నిర్వాహకులు కింద నుంచి రెయిలింగ్‌ను సిమెంటుతో నిర్మించారు. ఎత్తయిన గోడ కట్టినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు అది పూర్తిగా కూలిపోయింది. లోతట్టు ప్రాంతం కావడం, అక్కడే వంతెన ఉండటం వల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది.



వేగంగా వచ్చి వాహనాలు రాత్రి వేళ అదుపుతప్పితే లోయలోకి పడిపోయే ప్రమాదముంది. రాత్రివేళ ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్లతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

– న్యూస్‌టుడే, చింతపల్లి

బాలికల చదువుకు బాసట!

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలోని చాలామంది బాలికలు పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో చదువులు ఆపేస్తున్నారు. ఇంటర్ తరువాత డిగ్రీ, డిప్లొమా, ఉన్నత చదువులు కొనసాగించాలనుకునే విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏడాదికి రూ.30 వేల చొప్పున ఉపకారవేతనాన్ని మంజూరు చేస్తోంది. తాము ఎంచుకున్న కోర్సు కాలం పూర్తయ్యేంతవరకూ ఉపకార వేతనం ఏటా మంజూరు అవుతుందని నవనిర్మాణ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్ విద్యార్థులుగా చదివి ఉండాలి. దేశంలో ఎక్కడైనా ఏ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, విశ్వవిద్యాలయాల్లో 2 నుంచి ఐదేళ్ల కాలపరిమితి కలిగిన కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. మొదటి ఏడాది ప్రవేశానికి సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది ఆగస్టు 10 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మొదటి విడత దరఖాస్తుల స్వీకరణకు సోమవారం వరకే గడువు ఉంది. రెండో విడత 2027 జనవరి 10 నుంచి జనవరి 31 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు వారి ధ్రువపత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా, పాస్‌ఫొటోలను సమర్పించాలి. వివరాలకు 94407 39892, 94927 85941 నంబర్లలో సంప్రదించాలని నవనిర్మాణ సమితి ప్రతినిధులు తెలిపారు.

అర్హులందరూ ఓటరుగా నమోదుకు చర్యలు



విద్యార్థులకు ఓటరు నమోదు పత్రాలు అందజేస్తున్న జేసీ శ్రీపూజ, బీఎల్ఓలు, అధ్యాపకులు

పాడేరు, న్యూస్‌టుడే: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటు హక్కు పొందేందుకు అర్హులు. వారంతా ఓటరుగా నమోదయ్యేందుకు చర్యలు చేపడుతున్నట్లు సంయుక్త కలెక్టర్ శ్రీపూజ చెప్పారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలకు వెళ్లి 18 ఏళ్లు నిండిన విద్యార్థులతో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేయించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు/ పదో తరగతి ధ్రువపత్రం జత చేయాల్సి ఉంటుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షిస్తామని, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల డీటీ లక్ష్మణమూర్తి, అధ్యాపకులు అప్పలనాయుడు, ఆర్ఐ నల్లన్న, బీఎల్‌వోలు రవికుమార్, లీలా ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీతం రాక.. జీవితం సాగక!

పాడేరు, న్యూస్‌టుడే

ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా నెలయ్యేసరికి జీతం చేతికి అందకపోతే ఇబ్బందులు తప్పని రోజులివి. చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకొని బతుకు బండి నడిపించే వారికైతే సమయానికి జీతం ఎంతో అవసరం. నెలల తరబడి రావాల్సిన మొత్తం చేతికి అందక వేతనజీవులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉపాధ్యాయలు (సీఆర్టీలు), డిగ్రీ కళాశాలల్లో పార్ట్‌టైమ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి పరిస్థితి ఇలాగే ఉంది.

నెలలుగా వేతనాలకు నోచుకోని చిరుద్యోగులు

285 మంది సీఆర్టీల నిరీక్షణ: పాడేరు ఐటీడీఏ పరిధిలో 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 285 మంది తాత్కాలిక ఉపాధ్యాయులకు 2026 మార్చి నుంచి వేతనాలు అందడం లేదు. గతంలో బిల్లులు పెడితే నేరుగా వారి ఖాతాల్లో జమయ్యేవి. ప్రభుత్వం 'నిధి 'యాప్‌ను తీసుకొచ్చి వేతనాల చెల్లింపునకు సంబంధించి ఉద్యోగుల వివరాలు అన్నీ ఆ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. ఇందులో వివరాలను పొందుపరిచి ఉద్యోగుల వివరాలను ఖజానాకు సమర్పించాలి. అక్కడ అధికారులు వాటిని ఆమోదించిన తర్వాతే వేతనాలు బట్వాడా అవుతాయి. జిల్లాలోని సీఆర్టీలకు ఆరేడు నెలలుగా వేతనాలు చెల్లించలేదు.



గిరిజన సంక్షేమశాఖ డీడీ పరిమళకు విన్నవిస్తున్న సీఆర్టీలు

వారికి ఎలా పడ్డాయి?: రాష్ట్రంలోని తొమ్మిది ఐటీడీఏల్లో.. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్టీలకు మాత్రం జీతాలు అందాయి. అల్లూరి జిల్లాలో పనిచేస్తున్న వారికే ఎందుకు జాప్యం జరుగుతోందో తెలియడం లేదని ఇక్కడి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పాడేరు ఐటీడీఏ పర్యవేక్షకులు జి.పోతురాజు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. నిధి యాప్‌లో ఉద్యోగుల వివరాలను పొందుపరిచి ఖజానా అధికారులకు సమర్పించామని చెప్పారు. వారి ఆమోదం పొందిన వెంటనే వేతనాలు జమవుతాయన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని సీఆర్టీల్లో చాలామంది 2008, 2010లో చేరినవారున్నారు. వీరి జాయినింగ్ ఆర్డర్లు లేకపోవడంతో ఆలస్యమైంది. వారం రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని ఆయన తెలిపారు.

అతిథి అధ్యాపకులకు ఉపవాసమే..: డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి కూడా వేతనాల చెల్లింపులు లేవు. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి వీరికి రెన్యువల్ ఉత్తర్వులు ఉన్నత విద్యాశాఖ నుంచి రావాలి. ఇప్పటివరకు అటువంటి ఉత్తర్వులు ఏవీ రాలేదు. జిల్లాలో పాడేరు, చింతపల్లి, కొయ్యూరు, అరకులో రెండు డిగ్రీ కళాశాలలున్నాయి. గత విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు కూడా ఇవ్వలేదు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి తిరిగి పనిచేస్తున్నారు తప్ప వేతనాలు పొందడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 1100 మంది పరిస్థితి ఇలాగే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మారికవలస గిరిజన బాలికల గురుకులంలో ఉద్రిక్తత

అధికారులను అడ్డుకున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మారికవలస గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల వద్ద ఆదివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మారికవలస ఐటీహిల్స్‌రోడ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు నేపథ్యంలో విద్యార్థుల వసతుల మార్పుపై అధికారుల ఏకపక్ష నిర్ణయం, సరిగాలేని సదుపాయాల కారణంగా తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. బాలికల వసతిగృహాల్లోకి బాలురను తీసుకువచ్చారని, ఆయా డార్మిటరీలు అధ్వానంగా ఉన్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఆర్డీవో ఎస్.దిలీప్ చక్రవర్తిని తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. అధికారుల నుంచి పొంతనలేని సమాధానం రావడంతో ఆర్డీఓను పాఠశాల గేటు వద్దే అడ్డుకున్నారు. సీవోఈ కేంద్రాలకు తాము వ్యతిరేకం కాదని.. వాటి కోసం ఎన్నో భవనాలు ఉన్నాయని.. వాటిలో ఏర్పాటుచేయాలన్నారు. చిన్నారులు చదివే గురుకులాలను బలవంతంగా ఖాళీ చేయించి వాటిలో పెట్టడం సరికాదన్నారు. ఆర్డీవో బయటకు వెళ్లే సమయంలో అడ్డుకోవడంతో మరింత ఉద్రిక్తత నెలకొని తోపులాట జరిగింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి ఆర్డీవోను ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లారు.



పాఠశాల ప్రధాన గేటువద్ద ఆర్డీవోను అడ్డుకుంటున్న ప్రజాసంఘాల నాయకులు, తల్లిదండ్రులు

సీఎం పర్యటన అడ్డుకుంటారని..: సీఎం చంద్రబాబు నాయుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనను ఆదివాసీ గిరిజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకుంటారనే భయంతో అధికారులు మభ్యపెట్టారని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. ఆదివారం పాఠశాల వద్దకు చేరుకుని ఆయన మాట్లాడారు. మారికవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలను యథావిధిగా కొనసాగిస్తున్నామని ప్రకటించి మోసం చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు రేణుశ్రీ ఎంపిక



రావికమతం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఆరో స్థానంలో నిలిచిన బాలిక **గంజి రేణుశ్రీ** జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. 51వ స్టేట్ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్-2026 రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో విశాఖపట్నం మున్సిపల్ స్టేడియంలో జరిగాయి. అండర్-12 బాలికల విభాగంలో రావికమతానికి చెందిన రేణుశ్రీ సత్తా చాటింది. పరవాడలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్న ఈమె గత నెలలో అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటడంతో నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవి శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.రామారావు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు.

ఫిర్యాదులపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి

పాడేరు, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ ఫిర్యాదులు పరిష్కారమైన అనంతరం అర్జీదారులు తప్పనిసరిగా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కలెక్టర్ నిశాంతి కోరారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ సిస్టం అందుబాటులోకి తెచ్చిందన్నారు. మొబైల్ ద్వారా ఫీడ్‌బ్యాక్ పోర్టల్ ఓపెన్ చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చన్నారు. దీంతో తదుపరి చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఫిర్యాదుదారులు ఫీడ్‌బ్యాక్ అందించి ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నీట్ పీజీ పరీక్షకు 97.58 శాతం హాజరు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని మూడు కేంద్రాల్లో ఆదివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన నీట్ పీజీ పరీక్షకు 1,947 మంది అభ్యర్థులకు 1,900 మంది (97.58 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది.

పొగమంచు గిలిగింత.. పర్యాటకుల పులకింత!



ఈ ఏడాది చలికాలం ముందే వచ్చిందా అన్నట్లుగా మన్యంలో వాతావరణం భిన్నంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో దట్టంగా పొగమంచు అలుముకుంటోంది. మధ్యాహ్నం ఎండ కాస్తున్నా సాయంత్రానికి కొన్నిచోట్ల చిరుజల్లులు పడుతున్నాయి. ఈదురుగాలుల కారణంగా సాయంత్రం వేళల్లో చలితీవ్రత పెరుగుతోంది. భిన్న వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వారాంతాల్లో దూరప్రాంతాల నుంచి పర్యాటకులు చింతపల్లి మండలం లంబసింగి, తాజంగి, చెరువులవెనం వస్తున్నారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

గిరిజన విద్యార్థుల కోసమే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'


మారికవలసలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరిన విద్యార్థులతో మాట్లాడుతున్న కార్యదర్శి గౌతమి

కొమ్మాది, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని తీర్చి దిద్దడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎం.గౌతమి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం మారికవలస బాలుర గురుకుల పాఠశాల క్యాంపస్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. బీసీ, సోషల్ వెల్ఫేర్ శాఖల తరహాలోనే గిరిజన సంక్షేమశాఖకు ఈ ప్రత్యేక సీవోఈ మంజూరయిందన్నారు. దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ 'ఫిజిక్స్‌వాలా'ను ఆర్ఎఫ్‌పీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ఉత్తరాంధ్ర, మైదాన ప్రాంత విద్యార్థులకు అనుకూలమైన ఎడ్యుకేషన్ హబ్ కావడంతో మారికవలసను ఎంపిక చేశామన్నారు. మెరిట్ ఆధారంగా 600మంది బాలురు, బాలికలను ఎంపిక చేశామన్నారు. గురుకులాల తరహాలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు కో-ఎడ్యుకేషన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి గృహాలు, తరగతి గదులు కేటాయించడంతో పాటు అదనపు సీసీ కెమెరాలు, ప్రత్యేక వార్డెన్లు, పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపల్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అపోహలు వీడాలి.. : తల్లిదండ్రులకు ముందే పూర్తి అవగాహన కల్పించి, విద్యార్థులకు ఘనంగా ఫేర్‌వెల్ ఇచ్చి వారి అభ్యర్థన మేరకు పక్కనే ఉన్న బాలికల క్యాంపస్, కృష్ణాపురం, సబ్బవరం గిరిజన గురుకులాలకు సురక్షితంగా బస్సుల్లో పంపించామని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రే క్యాంపస్‌ను ఖాళీ చేశారనడంలో ఎలాంటి నిజం లేదని ఆమె తేల్చి చెప్పారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎస్.కె జిలాని తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మళ్లవీధికి చెందిన సరిసా జయసూర్య(28) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో దిగులుగా ఉండేవాడు. దీంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై మృతుడి తండ్రి వెంకట రామారావు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

ఐక్యంగా పోరాడతాం.. ఆత్మగౌరవం కాపాడుకుంటాం

నినదించిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయులు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా తరలొచ్చి నిరసన

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే

ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడతామని మెగా డీఎస్సీ-2025 ఉద్యోగులు నినదించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో విశాఖ బీచ్‌రోడ్డు ఆదివారం హోరెత్తింది. తమపై వస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ మెగా డీఎస్సీ ఆత్మ గౌరవ పోరాట సమితి ఆధ్వర్యంలో చలో విశాఖ-ఆత్మ గౌరవ గర్జన నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు. వైఎంసీఏ వద్ద జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ దగా డీఎస్సీ కాదు.. మెగా డీఎస్సీ అని, కష్టంతో సాధించామని..పాఠాలు మాత్రమే కాదని..గుణపాఠాలు చెబుతామని నినాదాలు చేశారు. అనంతరం ప్లకార్డులు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వైకాపా నేతలు తమపై అసత్య ఆరోపణలు చేస్తే బంగాళాఖాతంలో కలిపేస్తాం, ఇకపై తప్పుడు ప్రచారాలకు గట్టి సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సముద్రంలా ఉప్పొంగుతాం: క్రీడా కోటాలో నాకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. గురువు అంటే ఉద్యోగం కాదు.. ఒక బాధ్యత. అలాంటి వృత్తిపై అసత్యప్రచారాలు మానుకోవాలి. ఎవరికైనా సందేహం ఉంటే చట్టరీత్యా ఎదుర్కోండి. విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్చకు సిద్ధమని సవాలు విసిరినా ప్రతిపక్ష నేతలు ఎందుకు రాలేదు. మమ్మల్ని ఇబ్బంది పెడితే సహించం..ప్రశాంతంగా ఉన్న సముద్రాన్ని డిస్టర్బ్ చేస్తే పొంగినట్లు ఉప్పొంగుతాం. మా పోరాటంలో న్యాయం ఉంది. కష్టం, నిజం, నిరీక్షణ ఉన్నాయి. - షెహనాజ్, విశాఖ





ఇలా ఎవరూ రోడ్డెక్కలేదు..: డీఎస్సీ కోసం రాత్రి, పగలు తేడా లేకుండా చదివాం. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక వైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరో వైపు డీఎస్సీకి సన్నద్ధమయ్యా. విద్యను రాజకీయం చేయడం దురదృష్టకరం. ఇంతవరకు ఏ ఉపాధ్యాయుడు తన ప్రతిభను చాటుకోవడం కోసం రోడ్డెక్కిన పరిస్థితి లేదు. అటువంటిది మమ్మల్ని రోడ్డెక్కించారు. - భాగ్యలక్ష్మి, కాకినాడ



పారదర్శకంగా చేపట్టారు..: కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించింది. కొన్ని సంవత్సరాలుగా కష్టపడి చదివాం. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష రాశాం. అందులో ఎవరికి ఏ ప్రశ్న వస్తుందో తెలియదు. కీ విడుదలయ్యాక అన్ని తనిఖీ చేసుకుంటే వచ్చిన మార్కులు తెలిశాయి. మెరిట్‌లిస్టు ఇచ్చాక అభ్యంతరాలకు అవకాశం ఇచ్చారు. ఈ డీఎస్సీ అత్యంత పారదర్శకతతో నిర్వహించారు. ఈ డీఎస్సీ తప్పితే నాకు వయసు కూడా అయిపోతుంది. ఇన్నేళ్ల నాశ్రమ వృథా అయ్యేది. - నరేంద్ర బొడ్డు, గోపాలపట్నం



దురుద్దేశంతోనే దుష్ప్రచారం: కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడమే కాకుండా గౌరవప్రదంగా నియామకపత్రాలు అందించింది. తర్వాత శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా బాధ్యతలు అప్పగించారు. మరో రెండు నెలలైతే ఉద్యోగంలో చేరి ఏడాదవుతుంది. కొందరు కావాలనే మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. చదువుకోలేని వారు కూడా ఆరోపణలు చేస్తున్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. - కాత సూర్యకుమారి, చింతపల్లి

ఏ పరీక్షకైనా సిద్ధమే: డీఎస్సీలో ఉద్యోగాలు తెచ్చుకున్న తమపై అసత్య ఆరోపణలు చేసి కలత చెందేలా చేస్తున్నారు. మేం ఏ పరీక్షకైనా సిద్ధమే. దుష్ప్రచారాలు చేస్తే సముద్రంలో కలిపేస్తాం. డబ్బులిచ్చి కొనుక్కున్నారని కొందరు మాట్లాడుతున్నారు. అవును..మేం రూ.750 డబ్బులిచ్చి పోస్టు కొనుక్కున్నాం. గతంలో రూ.500 అప్లికేషన్ ధర ఉంటే గత ప్రభుత్వంలో దాన్ని రూ.750కి పెంచారు. అదనంగా రూ.250 ఎక్కువిచ్చి తెచ్చుకున్నాం. - దేముడు, విజయనగరం



హాకీలో అదరగొట్టారు!

అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు కైవసం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అమరావతిలో జరిగిన హాకీ పోటీల్లో అనకాపల్లి జిల్లా జట్టు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించింది. అండర్-23, 17 బాలుర జట్లు ప్రథమ స్థానంలో నిలిచి అమరావతి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. అండర్-23 విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో సత్యసాయి జిల్లా జట్టుతో తలపడి 3-0 గోల్స్‌తో అనకాపల్లి జిల్లా జట్టు విజయం సాధించింది. అండర్-17 విభాగంలో తిరుపతి జిల్లా జట్టుతో తలపడిన అనకాపల్లి జిల్లా జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం నమోదు చేసింది. క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి శైలజ, కోచ్ నరేశ్ అభినందించారు.


విజేతగా నిలిచిన అండర్23 అనకాపల్లి జిల్లా జట్టు


విజేతగా నిలిచిన అండర్17 జిల్లా జట్టు

హోరాహోరీ పోరులో విజయం..: చిన్నప్పటి నుంచి హాకీ అంటే ఇష్టం. ఎలమంచిలిలో సాధన చేసి పోటీల్లో పాల్గొన్నా. అండర్-17 విభాగంలో అనకాపల్లి జిల్లా జట్టు తరఫున ఆడా. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో సత్తా చాటి విజేతలుగా నిలిచాం. - చైతన్య, పదో తరగతి విద్యార్థి

ఆనందంగా ఉంది..: అండర్-23 విభాగంలో జిల్లా జట్టు తరఫున ఆడి, విజయం సాధించడం ఆనందంగా ఉంది. అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలో జిల్లాకు పేరు తెచ్చేలా క్రీడాకారులంతా శ్రమించడంతో ప్రథమ స్థానంలో నిలిచాం. - కూరపాటి రమేశ్, డిగ్రీ విద్యార్థి

ప్రతిభావంతులకు గుర్తింపు..: అమరావతి ఛాంపియన్‌షిప్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు గుర్తింపు దక్కింది. పోటీలను చాలా బాగా నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా జట్టుకు హాకీలో ప్రథమ స్థానం రావడం, ఆ జట్టులో నేను ఉండటం గర్వంగా ఉంది. - జగదీశ్, డిగ్రీ విద్యార్థి

ఇదే స్ఫూర్తితో ముందుకు..: భవిష్యత్తులో దేశం తరఫున ఆడాలన్నదే లక్ష్యం. చదువుతోపాటు హాకీలోనూ రాణించేలా సాధన చేస్తున్నా. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతా. - ఆశ్లేష్, పదో తరగతి విద్యార్థి

కరాటే పోటీల్లో విజేతలకు బహుమతులు

మునగపాక, న్యూస్‌టుడే: మదర్ థెరిసా మెమోరియల్ ఫౌండేషన్, అన్నపూర్ణ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో తోటాడలో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 200 మంది పాల్గొన్నారని కోచ్ శివ చెప్పారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వీరునాయుడు, మాజీ ఎంపీపీ వెంకట్, కొణతాల రఘునాథ్, కుమార్ పాల్గొన్నారు.


ట్రోఫీలు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

కరవు జిల్లాగా ప్రకటించాలి

ఎస్.రాయవరం: అనకాపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు, కరవు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కరవు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు కోరారు. రామయ్యపట్నం వద్ద ఖాళీ భూములను ఆదివారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 12,500 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారన్నారు. సాగునీరు అందించే వరాహ, తాండవ నదులు నీరులేక వెలవెల బోతున్నాయన్నారు.

పెరిగిన ధరలతో ఉల్లి లొల్లి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పెరిగిన ఉల్లి ధరలు సామాన్యుల కళ్ల వెంట నీళ్లు తెప్పిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే భారీగా ధర పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోంది. మహారాష్ట్ర నుంచి మనకు ఉల్లి దిగుమతి అవుతుంది. ఎల్‌నినో ప్రభావం. . వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కొత్త పంట ఇంకా సాగులోకి రాలేదు. దీంతో వ్యాపారులు పాత సరకునే ధరపెంచి విక్రయిస్తున్నారు. నిల్వ తక్కువ, డిమాండ్ ఎక్కువ ఉండటంతో ధర అమాంతం పెరిగిపోతోంది. పదిహేను రోజుల వ్యవధిలోనే రూ.55 నుంచి రూ.60 లకు చేరింది. హోల్‌సేల్‌లో రూ.50 వరకు పలుకుతోంది. దీంతో వినియోగదారులు ధరలు చూసి ఆందోళన చెందుతున్నారు. కొత్త పాయలు రావడానికి సమయం పడుతుందని, ఇప్పుడున్న ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

తెదేపా సీనియర్ నేత పినపోలు మృతి



బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ గ్రామీణ జిల్లా తెదేపా పూర్వ అధ్యక్షుడు, సీనియర్ నేత **పినపోలు వెంకటేశ్వరరావు** (75) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. స్వగ్రామం పి.భీమవరంలో ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. ఈయన 1982-87 మధ్య సర్పంచిగా పనిచేశారు. బుచ్చెయ్యపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. అదే సమయంలో డీసీసీబీ డైరెక్టర్‌గానూ పనిచేశారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009 ఎన్నికల్లో చోడవరం శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కొంతకాలంగా చోడవరంలో నివాసం ఉంటున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యసేవలు అందిస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందారని తెలిపారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఆడారి రమాకుమారి, భాజపా నాయకుడు ఈర్లె శ్రీరామమూర్తి తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు రాజు, గంటా శ్రీనివాసరావు అంతియమాత్రలో పాల్గొని పాడె మోశారు.


పినపోలు వెంకటేశ్వరరావు పాడె మోస్తున్న ఎమ్మెల్యేలు గంటా, కేఎస్ఎన్ఎస్ రాజు

మద్యం మత్తులో కారుతో బీభత్సం


ప్రమాదానికి గురైన కారు, ద్విచక్రవాహనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు కారు నడిపి.. నాలుగు ద్విచక్ర వాహనాలు, మరో కారును ఢీకొన్న ఘటన చింతపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై నిల్చున్న యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా తునికి చెందిన పడాల సాయి, మామిడి రమేష్, కిరణ్ ఆదివారం గూడెంకొత్తవీధి మండలం ధారకొండ ధారాలమ్మను దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు మద్యం తాగారు. జాతీయ రహదారిపై అంతర్ల వద్ద కారు అదుపు తప్పింది. సర్వీసింగ్ సెంటర్ బయట రోడ్డు పక్కనున్న నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక కారును బలంగా ఢీకొంది. రోడ్డుపై నిల్చున్న యువకుడు రమేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కారులో ఉన్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 32 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు


బాలురు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాలలో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం జరిగాయి. 32 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సతీష్ చెప్పారు. సబ్ జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలకు 150 మంది హాజరయ్యారన్నారు. విజయనగరం జిల్లాలో సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యదర్శి నూకరాజు, 15 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.400 కోట్లతో మౌలిక వసతుల కల్పన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు రూ.400 కోట్లు వ్యయం చేయడానికి ప్రభుత్వం అనుమతించిందని కమిషనర్ కేతన్‌గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. రహదారుల అభివృద్ధి, కాలువలు, విభాగినులు, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ఆయా నిధులు వ్యయం చేస్తామని.. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏకు రూ.200 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని పురపాలక మంత్రి నారాయణ పేర్కొన్నారని చెప్పారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం


చౌడుపల్లి గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న గ్రామస్థులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని.. ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని చౌడుపల్లి గ్రామానికి చెందిన ఉద్యోగులు మహేంద్రనాథ్, కోరాబు చక్రవర్తి, కోరాబు సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఉగ్రంగి వెంకటరవిప్రసాద్, రత్నప్రసాద్.. తమ తండ్రి ఉగ్రంగి వెంకటరమణ జ్ఞాపకార్థం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రామస్థుల సహకారంతో ఇందులో సౌకర్యాలు కల్పించి ఆదివారం ప్రారంభించారు. గ్రామపెద్దలు, యువత, మహిళల సహకారంతో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని, గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుందని పలువురు పేర్కొన్నారు. డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. బాలగంగాధర్‌తిలక్, యూవీ గిరి, వసుపరి చిన్నారావు, సరమండ తిలక్, దేపూరి శశికుమార్, కరుణానిధి, కిరణ్, విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి

అరకులోయ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో ఎండపల్లివలస సమీపంలో ఈనెల 26న జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు నాగశౌర్య(10) ఆదివారం మృతి చెందాడు. గన్నెల గ్రామానికి చెందిన నాగశౌర్య ప్రమాదంలో గాయపడి విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించటంతో ఆదివారం బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతితో గన్నెల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మెరిట్ జాబితా ప్రదర్శన

కొయ్యూరు: కొయ్యూరు మండలంలో 30 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను ఎంఈవో కార్యాలయంలో ఆదివారం ప్రదర్శించారు. జాబితాలో పేర్లపై అభ్యంతరాలుంటే సోమవారం తెలియజేయాలని ఎంఈవో సింహాచలం కోరారు.

గురుకుల వ్యవస్థను బలోపేతం చెయ్యాలి

పాడేరు, న్యూస్‌టుడే: ప్రైవేటు ఏజెన్సీలపై ఆధారపడటం దీర్ఘకాలిక పరిష్కారం కాదని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స అన్నారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలోని ఏకైక గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 480 మంది గిరిజన విద్యార్థులను రాత్రి సమయంలో బలవంతంగా ఇతర విద్యా సంస్థలకు, ఇళ్లకు తరలించారు. ఇది అమానవీయ చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. మారికవలస గురుకుల పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గురుకుల వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కోసం ప్రత్యామ్నాయంగా స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు.


డుంబ్రిగుడ సమావేశంలో వినియోగదారుల ప్రతినిధులు

వస్తువు కొనుగోలులో రసీదు తప్పనిసరి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘ సమాఖ్య ఛైర్మన్ బూడిద చిట్టిబాబు, కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కిడారి భవన్‌లో నియోజకవర్గ వినియోగదారుల సంఘం ఆధ్వర్యాన వినియోగదారుల హక్కులు, పరిరక్షణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వస్తువు కొనుగోలులో రసీదుతోపాటు ఎంఆర్‌పీ ధర, నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువులో లోపాలు, నాణ్యత లోపించిన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు, కార్యదర్శి రాజ్‌కుమార్, జక్కయ్యతోపాటు ఆరు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చమ్మచింతలో పోలీసుల మెరుపు దాడి

నాతవరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ఆపరేషన్ వజ్రహార్ కార్యక్రమాన్ని ఆదివారం చమ్మచింత పంచాయతీ తాండవలో నిర్వహించారు. నర్సీపట్నం గ్రామీణ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో వివిధ స్టేషన్లకు చెందిన 56 మంది పోలీసులు 8మంది ఎస్సైలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈమేరకు 300 ఇళ్లల్లో సోదాలు జరిగాయి. సరైన పత్రాలు లేని 35 బైకులు, ఒక ఆటో 180 ఎంఎల్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మెరుపు దాడిలో 600 మంది వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి సాగు, రవాణా, పాత నేర చరిత్రగల నివాసాలపై ప్రత్యేక దృష్టి సారించారు. 15మందిని గంజాయి రాపిడ్ కిట్లతో పరీక్షలు నిర్వహించి ఒకరికి పాజిటివ్ ఉన్నట్టు తెలిపారు. చమ్మచింత, కురువాడలో మాదక ద్రవ్యాల వినియోగంతో నష్టాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. నర్సీపట్నం సబ్‌డివిజన్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహిస్తామని సి.ఐ. రేవతమ్మ తెలిపారు. నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ, కె.డి.పేట సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు కార్మిక నేతపై అవినీతి ఆరోపణలు

నిలిచిన పదవీ విరమణ ప్రయోజనాలు

ఈనాడు విశాఖపట్నం: విశాఖ ఉక్కులో ఓ కార్మిక నేతపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని.. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఉక్కు కార్యదర్శి, సీబీఐ, సీవీవో, సీపీ తదితరులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ఫ్యామిలీ పింఛను పథకం, కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లు (సీడబ్ల్యూసీ), ఐడీ కేసులు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం(వీఆర్ఎస్) తదితర అంశాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సదరు నాయకుని ఉద్యోగ విరమణ ప్రయోజనాలను నిలిపివేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఫిర్యాదుల నేపథ్యంలో ఈనెల 31వ తేదీతో ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగుల జాబితాలో సైతం సదరు నాయకుడి పేరు లేకపోవడం కర్మాగారం అంతటా చర్చనీయాంశం అయ్యింది.

వసూళ్లు ఇలా...

▼ కొవిడ్ సమయంలో మృతిచెందిన ఉక్కు ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ పథకం కింద లభించే ప్రయోజనాలను ఇప్పిస్తానని చెప్పి పలువురు బాధిత కుటుంబాల నుంచి డబ్బు వసూలు చేసినట్టు ఫిర్యాదు అందింది.

▼ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లలో అలంకరణ పనులు చేపట్టే గుత్తేదారు నుంచి అనధికారిక రుసుములు వసూలు చేసినట్లు తెలిసింది. సీడబ్ల్యూసీల్లో ఏటా 200 కార్యక్రమాలు వరకు జరుగుతుండగా.. సుమారు రూ.50-60 లక్షల వరకూ పక్కదారిపట్టినట్లు ఆరోపణలున్నాయి. ▼ 2020-25 మధ్య కాలంలో కర్మాగారం వెలుపల జరిగిన కొన్ని ప్రమాదాలను విధి నిర్వహణలో జరిగిన గాయాలుగా చూపించి ప్రయోజనాలు పొందినట్టు సమాచారం. ▼ అంతర్గత బదిలీలు, క్వార్టర్ల కేటాయింపులు వంటి అనేక వ్యవహారాల్లో సుమారు రూ.15 కోట్లు ఈ విధంగా వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందకపోవచ్చని ఉద్యోగులను భయపెట్టి.. వారికి సాయం చేస్తానని చెప్పి 30-40 మంది ఉద్యోగుల నుంచి సుమారు 1.5కోట్లు వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో వన్యప్రాణుల దత్తత


దాతలకు జంతు దత్తత ధ్రువపత్రాలు అందిస్తున్న క్యూరేటర్ మంగమ్మ తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పలువురు చిన్నారులు పుట్టినరోజులను పురస్కరించుకుని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల (జూ)లో వన్యప్రాణులను దత్తత తీసుకున్నట్లు క్యూరేటర్ జి.మంగమ్మ ఆదివారం తెలిపారు. జూలో అమలవుతున్న 'జంతు దత్తత' కార్యక్రమంలో భాగంగా గడచిన వారం రోజులుగా 10 వన్యప్రాణులను దాతలు దత్తత తీసుకుని వాటి సంరక్షణ కోసం రూ.1,46,100 విరాళంగా అందించారన్నారు. వీటిలో కొన్నింటిని ఏడాది పాటు, మరి కొన్నింటిని నెలల పాటు దత్తతగా స్వీకరించారన్నారు. రెడ్డి విహాన్‌వర్ధన్ 4 జంతువులకు(హిమాలయన్ గోరల్, చిలుక, చిరుతపులి, చారల హైనా) కలిపి రూ.38 వేలు, సియాన్ తన్వి 3 జంతువులకు(రాయల్ బెంగాల్ టైగర్, హిమాలయాన్ నల్ల ఎలుగుబంటి, చుక్కల జింక) రూ.30,600, హేమఐశ్వర్య గొల్లు కుటుంబ సభ్యులు (హిమాలయాన్ గోరల్) రూ.10 వేలు, సత్తారు కనిష్క(హిమాలయాన్ నల్ల ఎలుగుబంటి) రూ.54 వేలు, సత్తారు పాపినాయుడు, ఆరుద్ర(చారల హైనా) రూ.13,500 విరాళంగా ఇచ్చారన్నారు. దాతలకు జూ అధికారులు 'జంతు దత్తత' ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సహాయ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, ఎఫ్ఎస్ఓ బి.భారతి తదితరులు పాల్గొన్నారు. దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు 94915 69344, 93915 26937, 78936 32900 నంబర్లలో సంప్రదించాలని క్యూరేటర్ సూచించారు.


పిల్లలు దత్తత తీసుకున్న జూలోని పలు జంతువులు

సంచార, అర్ధసంచార విముక్త జాతుల దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో భాజపా ఆధ్వర్యంలో సోమవారం సంచార, అర్ధసంచార విముక్త జాతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రావుగోపాలరావు కళాకేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సంచార జాతుల సదాచార వారసత్వం, సంస్కృతికి వారదులుగా నిలిచిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి గుర్తు చేయడానికి ఇది నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో భాజపా నాయకులు కె.శ్రీనివాసరావు, పలకారవి, కర్రిరామకృష్ణ పాల్గొన్నారు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: స్కూటర్ డిక్కీలో నగదు అపహరించిన కేసులో నిందితుడిని, ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడుతున్న మరో నిందితుడిని అనకాపల్లి పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్‌టీ కాలనీకి చెందిన ముప్పిడి రాజు పాత నేరస్థుడు. ఎన్టీఆర్ క్రీడా మైదానం వద్ద పార్కింగ్ చేసిన స్కూటీ డిక్కీ తెరిచి రెండు సెల్‌ఫోన్లు, చోడవరం రోడ్డులో పార్క్ చేసిన స్కూటీ డిక్కీ నుంచి రూ.5 వేల నగదు అపహరించాడు. రైల్వేస్టేషన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసులో ఓ బాలుడ్ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఏడుగురు యువకులను రక్షించిన లైఫ్‌గార్డులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం రుషికొండ తీరంలో ఆదివారం సముద్ర స్నానాలకు దిగిన ఏడుగురు యువకులు కొట్టుకుపోతుండగా జీవీఎంసీ, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ లైఫ్‌గార్డులు వారిని రక్షించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ (రాయపూర్)కు చెందిన రాజేంద్రసత్య, మనోజ్‌తండిల్‌వాల్, కిశోర్‌కుమార్‌ఠాకూర్, తరుణ్‌వర్మ, ఆంధ్రప్రదేశ్ పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టి.మురళీ, జి.శ్రీరామ్‌కుమార్, ఆర్.తేజశ్వర్‌రావు విహారయాత్రలో భాగంగా రుషికొండ తీరానికి విచ్చేశారు. ఈ క్రమంలో వీరు స్నానాలు కోసం సముద్రంలో దిగారు. అలల ఉద్ధృతి అధికంగా ఉండటంతో సముద్రంలో కొట్టుకుపోతున్న వీరిని లైఫ్‌గార్డులు గుర్తించి మెరైన్ పోలీసులు సహకారంతో సకాలంలో ఒడ్డుకు చేర్చారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మెరైన్ సీఐ అప్పారావు, ఎస్సై మనోజ్‌కుమార్ సూచనల మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు. సందర్శకులు సముద్ర స్నానాలు చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్ఎల్ఎస్ఎస్), వాటర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న లైఫ్‌గార్డుల సేవలను కొనియాడారు.


కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

విశాఖపట్నం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా హోటల్ గ్రీన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోలో పట్టుచీరల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు తెలిపారు. దేశం నలుమూలలు నుంచి తెచ్చిన విభిన్న సంప్రదాయ పట్టు వస్త్రాలు ప్రదర్శనలో ఉన్నాయని పేర్కొన్నారు. 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నెల రెండో తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	114	110
లైవ్	141	130
డ్రెస్డ్	219	230
స్కిన్‌లెస్	247	240

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 అరకులోయ: 63034 86346 చింతపల్లి: 94404 07658



ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల గ్రామంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో రేకులతో నిర్మించిన ఉన్న పంచాయతీ కార్యాలయంలో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. నూతనంగా చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నాం. – రాజు, స్థానికుడు. ✓: సచివాలయ భవన నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నిధులు విడుదలైతే 17 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. – ధర్మారావు, ఎంపీడీఓ, ముంచంగిపుట్టు.

బోడకొండమ్మ ఆలయంలో సౌకర్యాల కల్పన

చింతపల్లి, న్యూస్‌టుడే: లంబసింగి ఘాట్ రోడ్లో కొలువై ఉన్న బోడకొండమ్మ ఆలయానికి ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దూరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయం కొండ దిగువన ఎంపీ నిధులతో వ్యూపాయింట్ నిర్మించారు. దీంతో ఆలయం వద్ద భక్తులు, పర్యాటకుల వాహనాల కోసం ఇక్కడ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. గిరిజన సంక్షేమశాఖ నిధులతో ప్రత్యేకంగా చప్టాలను నిర్మించారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.

చెంతనే వైద్యసేవలు!

హెల్త్‌క్లినిక్ నిర్మాణాలకు నిధులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మారుమూల గిరిజన ప్రాంతాల్లో నిలిచి పోయిన విలేజ్ హెల్త్ క్లినిక్ (వైఎస్సార్) నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ. 22.50 లక్షలు కేటాయించడంతో పనులు ప్రారంభమయ్యాయి. దీంతో త్వరలోనే గిరిజనులకు గ్రామస్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైకాపా హయాంలో మంజూరైన ఈ కేంద్రాల పనులు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో చిన్నపాటి అనారోగ్య సమస్యలకు గిరిజనులు దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో పెండింగ్ పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.



సింగర్బలో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ డీఈ మాణిక్యం

స్థానికంగానే వైద్యసేవలు.. ఈ కేంద్రాలు పూర్తయితే జ్వరం, దగ్గు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు, గర్భిణులు, చిన్నారులకు ప్రాథమిక వైద్యం, టీకాల తదితర సేవలు స్థానికంగానే అందనున్నాయి. ముఖ్యంగా మారుమూల గ్రామాల గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. వైద్యం కోసం కొండలు దాటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండకపోవడంతో సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కానున్నాయి. జి.మాడుగుల మండలంలోని సింగర్బ, నుర్మతి, కె.కోడాపల్లి గ్రామాల్లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పాలమామిడి, గొందిపాడు గ్రామాల్లో భవనాలు దాదాపు పూర్తయ్యాయి.

పనులు వేగవంతం చేస్తాం.. మన్యంలోని అన్ని మండలాల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గతంలో నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించాం. జిల్లాలో పలు చోట్ల వీటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. జి.మాడుగులలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. – మాణిక్యం, పంచాయతీరాజ్‌శాఖ డీఈ, పాడేరు

ఒనకఢిల్లీలో ఎలుగు సంచారం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒనకఢిల్లీలో ఎలుగు సంచారం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. శనివారం సాయంత్రం మాచ్‌ఖండ్ ప్రాజెక్టు అతిథి గృహం వద్ద, ఉద్యోగుల ఇళ్ల సమీపంలో సంచరించడంతో ప్రజలు కేకలు వేశారు. స్థానిక బ్యాంకు సమీపంలో ఒక ఉద్యోగి తోటకు వెళ్లగా.. అక్కడ చెరకు తింటూ కనిపించింది. ఆదివారం అదే ప్రాంతంలో గిరిజనుడి వ్యవసాయ భూమి వద్ద ఉన్న గుడిసెలో సేద తీరుతుండగా అటవీశాఖ సిబ్బంది రంగప్రవేశం చేసి ఎలుగును తరమడంతో అటవీ ప్రాంతంవైపు పరుగులు తీసింది.



ప్రాజెక్టు ఐబీ వద్ద ఎలుగు

రోడ్డు ఛిద్రం.. జరభద్రం!

డుంబ్రిగుడ మండలంలోని లైగండ, తూటంగి మీదుగా వెళ్లే ప్రధాన రోడ్డు ఛిద్రమైంది. రహదారి గుంతల మయంగా మారడంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడే గుంతలు పడటంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. లైగండ నుంచి మజ్జిపుట్టు వరకు ప్రయాణించడడానికి సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే





మూగజీవాలతో ముప్పుతిప్పలు

డుంబ్రిగుడలోని జాతీయ రహదారిపై పశువుల సంచారంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జాతీయ రహదారి చెంతనే ఇవి ఉంటున్నాయి. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారిపై పశువుల సంచారం లేకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

అందేంత ఎత్తులో అపాయం

పెదబయలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు ఉండటంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు ఆడుకుంటూ అటువైపుగా వెళ్లిపోతున్నారు. విద్యుత్తు సంస్థ స్పందించి.. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే





నిర్లక్ష్యానికి నిదర్శనం

మన్యంలో రహదారులు, భవనాల శాఖ(ఆర్అండ్‌బీ) అధికారుల నిర్లక్ష్యంతో నిర్మించిన రోడ్లు.. ప్రమాదాలకు నిలయంగా మారాయి. సీతగుంట పంచాయతీ చిట్రాయిపుట్టు నుంచి సీకరి పంచాయతీ బంగారుమెట్ట వరకు ఆరు కిలోమీటర్ల రహదారిని ఇటీవల పూర్తిచేశారు. విస్తరణతో రాకపోకలకు కష్టాలు తీరినా.. మధ్యలో విద్యుత్తు స్తంభాలతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల-2 నుంచి రోగులపేట కూడలి వరకు పలుచోట్ల స్తంభాలపైనే రహదారిని వేసేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

శిథిల భవనంలో బిక్కుబిక్కు

డుంబ్రిగుడ మండలం సొవ్వాలో అంగన్‌వాడీ కేంద్రం పదేళ్లుగా శిథిలావస్థకు చేరింది. అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. భవనం ఏ క్షణంలో కూలిపోతుందోనని చిన్నారులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి దీన్ని తొలగించి, కొత్త భవనం నిర్మించాలని చిన్నారులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. - డుంబ్రిగుడ, న్యూస్‌టుడే



అవీ ఇవీ

నేడు బొండాపుట్టులో వైద్య శిబిరం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఏనుగురాయి పంచాయతీలోని బొండాపుట్టులో సోమవారం ఆంధ్రవనవాసీ కల్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నారని అల్లూరి యూత్ సభ్యులు సురేష్ తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో 'మీకోసం'..

కొయ్యూరు, న్యూస్‌టుడే: మంప స్వర్ణ గ్రామ సచివాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి పంచాయతీ చిన్నగెడ్డ గ్రామ సచివాలయం- 2 వద్ద సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. అర్జీదారులు సమస్యలను దరఖాస్తురూపంలో అందజేయాలన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ మండలం ఇరగాయి పంచాయతీలో సోమవారం మీకోసం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీసం ప్రసాద్ తెలిపారు. ఇరగాయి పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వసభ్య సమావేశం 2న

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో వచ్చే నెల 2వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఎంపీపీ కోరాబు అనూషాదేవి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

కొయ్యూరులో తెదేపా కార్యకర్తలతో..

కొయ్యూరు, న్యూస్‌టుడే: తెదేపా మండల సమావేశం సెప్టెంబర్ 2న కొయ్యూరులో జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కె.చంద్రరావు తెలిపారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు ఎంవీవీ ప్రసాద్, కె.సుబ్బారావు, పర్యాటకశాఖ డైరెక్టర్ కిల్లు రమేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. చీడిపాలెం పంచాయతీలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరుగుతుందన్నారు. శ్రేణులంతా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు

ఈ-కేవైసీ చేయించండి

కొయ్యూరు, న్యూస్‌టుడే: చింతపల్లి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో కొన్ని గ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ చేయించలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల పంచాయతీ కేంద్రాలకు అధికారులు సక్రమంగా గ్యాస్ అందించలేదని ఆరోపించారు. గ్యాస్ పంపిణీ చేసేటప్పుడే ఈ-కేవైసీ చేసే అవకాశం ఉన్నా ఎందుకు చేయలేకపోయారో చెప్పాలన్నారు. మారుమూల గ్రామాల్లోని ఆదివాసీ గిరిజనులకు ఈ-కేవైసీ చేయించుకోవాలని తెలియకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి అందరికీ ఈ-కేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నూతన నియామకం



హుకుంపేట, న్యూస్‌టుడే: భారత జాతీయ హ్యూమన్ రైట్స్ సంఘ ఉపాధ్యక్షుడిగా **బొండా నీలకంఠం** ఎంపికయ్యారు. మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈయన్ను ప్రసన్నకుమార్, రామారావు, వెంకట్ తదితరులు అభినందించారు.

వేతనాలు చెల్లించక ఇబ్బందులు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో పని చేస్తున్న తాత్కాలిక ఉపాధ్యాయుల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఆదివారం సీఆర్టీల సంఘం నాయకులు మోహన్‌రావు, బాలకృష్ణ జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, ఈ విద్యా సంవత్సరంలో జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై శ్రావణ్‌కుమార్ డీడీతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని సూచించారు. వారం రోజుల్లో వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపడతామని డీడీ పేర్కొన్నారు. సీఆర్టీల సంఘ నాయకులు ఎస్.మహేష్, తెదేపా నాయకులు పాండురంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తాత్కాలిక ఉపాధ్యాయులు

సామాజిక బాధ్యతగా రక్తదానం

పాడేరు, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానం.. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక కాఫీ హౌస్‌లో చైతన్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పెనుమాక రవికుమార్ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఈశ్వరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. చైతన్య ఛారిటబుల్ ట్రస్ట్ గత 20 సంవత్సరాలుగా వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని అభినందించారు. ఈ శిబిరంలో 23 యూనిట్ల రక్తం సేకరించారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం ప్రాంతం నుంచి 15 మంది యువకులు ప్రత్యేకంగా పాడేరు వచ్చి రక్తదానం చేశారు. రక్తదాతలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. మొదటి 10 మంది రక్తదాతలకు కుట్టుమిషన్లు, మిక్సీలు, ఫ్యాన్లు, వాలీబాల్ కిట్లు, క్రికెట్ బ్యాట్లు అందజేశారు. ట్రస్ట్ డైరెక్టర్లు అశోక్‌కుమార్, ప్రసన్నకుమార్, ప్రశాంత్‌కుమార్, రవికుమార్, చంద్రికశ్యామ్, జయ, జాన్‌వెస్లీ, ట్రస్ట్ ప్రతినిధులు శాండీ, నాగేంద్ర, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలతో గిడ్డి ఈశ్వరి, రవికుమార్ తదితరులు

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్‌లతో నిఘా



డ్రోన్ ఎగురవేస్తున్న పోలీసులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో గంజాయి రవాణా, నాటుసారా తయారీ తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్‌లతో నిఘా పెంచినట్లు కొయ్యూరు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నడింపాలెం, తీగలమెట్ట, బి.కొత్తూరు, పాడి, రత్నంపేట, కాట్రగెడ్డ, బట్టపనుకుల గ్రామాల్లో పోలీసులతో కలిసి సీఐ ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని గిరిజనులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల నియంత్రణ, మహిళా చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషిచేయాలన్నారు. నడింపాలెం కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణకు వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని గూడెంకొత్తవీధి ఎస్సై సురేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని పలు కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. శిరస్త్రాణం, సీటు బెల్టు ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేసినా చర్యలు తప్పవన్నారు.

జామిగుడ... సమస్యల వాడ



మూడేళ్లుగా పునాదులు దాటని అంగన్‌వాడీ భవనం

పెదబయలు, న్యూస్‌టుడే

పెదబయలు మండలం జామిగుడలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మౌలిక వసతులు సమకూరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఇదే పంచాయతీ గుంజివాడ గ్రామానికి చెందిన తండ్రి, తనయులు మండల పరిషత్ అధ్యక్షులుగా గతంలో పనిచేసినా కనీస సౌకర్యాలు నేటికీ సమకూరకపోవడం గమనార్హం.

★ గుంజివాడ గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ దాటాలి. ఇక్కడ వంతెన నిర్మాణానికి సుమారు రూ. మూడుకోట్ల నిధులతో గత వైకాపా హయాంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. నేటికీ వంతెన అసంపూర్తిగానే ఉంది. వానాకాలం వస్తే ఈ గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ప్రజలు సాహసం చేయాల్సి వస్తోంది.

★ పాఠశాలల్లో మౌలిక వసతులు కొరవడి విద్యార్థులు చాలీచాలని గదుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ★ జామిగుడ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నా.. ఈ మార్గంలో రహదారి పలుచోట్ల దెబ్బతిని ఇబ్బందులకు గురిచేస్తోంది. ★ మూడేళ్ల క్రితం ఇక్కడ ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్ర పనులు పునాదులు దాటని స్థితిలో ఉన్నాయి. ★ సచివాలయానికి సరైన భవనం లేక పాఠశాల భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ★ ఈ ప్రాంతంలో వైద్యకేంద్రాలు అందుబాటులో లేక చిన్నపాటి వైద్యానికైనా సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రూడకోట పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోంది. ★



మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ఫాల్గుణ ఆవిష్కరించిన శిలాఫలకం

పంచాయతీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణకు ప్రజలు విన్నవించుకోగా.. రహదారి సౌకర్యం కల్పించారు. మరికొన్ని అభివృద్ధి పనులకు బాటలు వేసినా అవి పూర్తికాలేదు. అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేసి ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

★ ఈ పంచాయతీలోని సుమారు 14 గ్రామాల ప్రజలకు దాహార్తిని తీర్చే మంచినీటి పథకాలు జల్‌జీవన్ పథకం కింద నిర్మించినా అవి అంతంతమాత్రంగానే పనిచేస్తున్నాయి.

★ పలు వీధుల్లో సీసీ రోడ్లు లేక పురాతన కాలం నాటి రాళ్లు పేర్చిన రోడ్డే ప్రజలకు దిక్కుగా మారింది. వీధి లైట్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



చింతపల్లిలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తోందని తెదేపా చింతపల్లి పట్టణ అధ్యక్షుడు రీమల ఆనంద్ అన్నారు. చింతపల్లిలో ఆదివారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. రెండేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తెదేపా గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు కోరాబు గాంధీ పడాల్, అనిల్‌కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా రాష్ట్ర ఎస్టీ విభాగం కార్యదర్శి కొర్రా బలరాం అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెదేపా సీనియర్ నాయకులు ముక్కలి మహేష్, బాలయ్య, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బుజ్జిబాబు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో..



గుంతలు పూడ్చుతున్న యువకులు

శ్రమదానంతో రహదారి బాగు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు నుంచి కుమడ వెళ్లే మార్గంలో గుంతలను పూడ్చేందుకు కనకదుర్గ ఆటో యూనియన్ చర్యలు చేపట్టింది. ఆదివారం ఆ సంఘంలోని యువకులు శ్రమదానంతో గుంతలు పూడ్చారు. భారీ వాహనాలు, టిప్పర్లు తిరగడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని గుంతలు పూడ్చేందుకు సంఘం ప్రతినిధులు చర్యలు చేపట్టారు. ముంచంగిపుట్టు నుంచి పెద్దాపుట్టు వరకు మార్గ మధ్యలో జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న గుంతలను పిక్కరాళ్లు పోసి పూడ్చివేశారు. రోడ్డు పొడవున ఉన్న గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. సంఘం నాయకులు పరమేష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న భూమిరెడ్డి వెంకటసత్య అప్పలసూర్య త్రినాథరావు సోమవారం పదవీ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ముంచంగిపుట్టు పాఠశాలలో త్రినాథరావు దంపతులను ఉపాధ్యాయులు, విద్యాశాఖ ఉద్యోగులు సన్మానించారు. 32 ఏళ్లపాటు విద్యాభివృద్ధికి ఆయన కృషి చేశారని డిప్యూటీ డీఈఓ చెల్లయ్య కొనియాడారు. సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. జోలాపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ.. ఎంఈఓగా సేవలు అందించారని ఎంఈఓ కృష్ణమూర్తి అన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖ అధికారులు త్రినాథరావు దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



త్రినాథరావును సత్కరిస్తున్న డిప్యూటీ డీఈఓ చెల్లయ్య తదితరులు

తీరనున్న నీటి కష్టాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సుజనకోట గ్రామంలో నీటి కష్టాలు తీరనున్నాయి. గ్రామంలోని కాలనీలో నీటి సదుపాయం లేక పదేళ్ల నుంచి ఇబ్బందులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ నిధులు రూ. 2.50 లక్షలు కేటాయించి బోరు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం గ్రామంలో పనులు ప్రారంభించారు. గ్రామంలో దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించిన ఎంపీడీఓ ధర్మారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ రాజేష్‌ను గ్రామస్థులు జగన్, నాగ, లక్ష్మీపతి, రాజేంద్ర, రమేష్ తదితరులు అభినందించారు. బోరు నిర్మాణంతో గ్రామంలో ఉన్న 200 మంది ప్రజలకు నీటి సదుపాయం సమకూరుతుందని ఆనందం వ్యక్తం చేశారు.



తాజంగిలో ఇంటి పనులకు భూమి పూజ చేస్తున్న పీడీ బాబూనాయక్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం

చింతపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో పీఎం జన్‌మన్ పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను గడువులోగా ప్రారంభించాలని గృహనిర్మాణ సంస్థ పీడీ బాబూనాయక్ అన్నారు. ప్రత్యేకాధికారి, ఈఈ శ్రీనివాస్‌తో కలసి చింతపల్లి మండలంలోని తాజంగి, లంబసింగి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. జిల్లాలో పీఎం జన్‌మన్ కింద ప్రభుత్వం ఈ ఏడాది 28,696 ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అందులో ఆగస్టు నెలాఖరు నాటికి ఎటువంటి పనులూ ప్రారంభించకుండా 3,303 ఇళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. నిర్మాణాలను త్వరతగతిన ప్రారంభించేందుకు ఐదురోజులుగా జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఆదివారం నాటికి 1,693 ఇళ్లను ప్రారంభించినట్టు తెలిపారు. సెప్టెంబరు 1నాటికి మిగిలిన 1,610 ఇళ్లను అబ్ధిదారులు ప్రారంభించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులు మొదటి విడత బిల్లులకోసం గృహనిర్మాణ సంస్థ ఏఈ కార్యాలయంలో పోస్టల్ అకౌంట్, లేదా బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఏఈఈ అరుణకుమారి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రమణ, రాజారావు పాల్గొన్నారు.

పనులపై ఆరా..

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కోనాపురం పంచాయతీ కరాయిగుడ గ్రామంలో పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జైరామాచారి ఆదివారం పరిశీలించారు. కరాయిగుడ గ్రామంలో 77 ఇళ్లు మంజూరు చేయగా.. అందులో పునాదుల స్థాయిలో 25, రూఫ్ స్థాయిలో 42, పూర్తిస్థాయిలో 10 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కరాయిగుడలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న ఎస్ఈ జైరామాచారి